నిర్దేశం
మన దిశా నిర్దేశం
హైదరాబాద్ | గురువారం | 14-09-2023



## త్వరలోనే పాక్ ఆక్రమిత కశ్మీర్ భారత్‌లో విలీనం

'కొంత కాలం ఆగండి.. పివోకే దానంతట అదే భారత్‌లో కలిసిపోతుంది' అని కేంద్ర మంత్రి వీకే సింగ్ వ్యాఖ్యా నించారు. భారత్‌తో సరిహద్దులు తెరవాలని పీవోకేలోని షియా ముస్లింలు ఇటీవల డిమాండ్ చేసిన నేపథ్యంలో వీకే సింగ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. **- నిర్దేశం, ఢిల్లీ**



## 15న కామారెడ్డి జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవం

**- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి**

**నిర్దేశం, కామారెడ్డి:** కామారెడ్డి పట్టణంలోని దేవునిపల్లిలో ఏర్పాటు చేసిన వైద్య కళాశాలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 15న వర్చువల్ విధానం ద్వారా ప్రారంభిస్తున్న కార్యక్రమాన్ని జిల్లా ప్రజలు విజయవంతం చేయవలసినదిగా మంత్రి ప్రశాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లోని స్టేట్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేలు సురేందర్, హనుమంత్ షిండే, ఉర్దూ అకాడమీ చైర్మన్ మహమ్మద్ ముజిబు ద్దీన్, అదనపు కలెక్టర్ చంద్ర మోహన్‌లతో కలిసి అంతర్గత సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ నూతన వైద్య కళాశాలలో 85 శాతం సీట్లు తెలంగాణ విద్యార్థులకు కాగా 15 శాతం ఇతర రాష్ట్ర విద్యార్థులకు ఉంటుందని అన్నారు. నీట్‌లో లక్షకు పైగా ర్యాంక్ వచ్చినా సీటు వస్తుందని అన్నారు.

## ఉస్మానియా యూనివర్శిటీలో 'డైనమిక్ లైటింగ్'






**నిర్దేశం, హైదరాబాద్ :** కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రాలు, చారిత్రక ప్రదేశాలు, భవిష్యత్ తరాలకు స్ఫూర్తి కలిగించే ప్రాంతాలు మొదలైన చోట్ల 'సౌండ్ అండ్ లైట్ షో'లను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి. తెలంగాణ ఉద్య మానికి కేంద్ర బిందువైనటు వంటి ఉస్మానియా యూనివర్సి టీలోని ప్రతిష్టాత్మకమైన ఆర్ట్స్ కాలేజీలో రూ. 12 కోట్లతో ప్రొ జెక్షన్ మ్యాపింగ్ అండ్ డైనమిక్ లైటింగ్ ఏర్పాటు చేసుకుంటున్నందుకు సంతోషంగా ఉందన్నారు ఆయన.

హైదరాబాద్ సందర్శించే పర్యాటకులకు మరింత ఆహ్లాదాన్ని అందించడంతో పాటు మన చరిత్రను తెలియజే యాలన్న లక్ష్యంతో ఉస్మానియా యూనివర్సిటీని అట్రాక్టివ్ టూరిస్ట్ ప్లేస్‌గా మార్చుతున్నట్లు కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్శిటీ నిర్మించాలని సంకల్పించినపుడు 1400 ఎకరాలను ఉదారంగా దానం చేసిన 'మా లకాబాయి చందా' గారిని గుర్తు చేసుకున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వారికి ఘనంగా నివాళులు అర్పించారు.

## గవర్నర్, సీఎం మధ్య విభేదాలతో 'వర్సిటీ రిక్రూట్మెంట్ బోర్డ్' బిల్లు ఆగిపోయింది

**నిర్దేశం, హైదరాబాద్:** రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి మధ్య విభేదాలతోనే యూనివర్సిటీ రిక్రూట్మెంట్ బోర్డ్ బిల్లు ఆగిపోయిందని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు. సంగారెడ్డిలో అర్ అండ్ బి అతిథి గృహంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన అనంతరం స్వేరో స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో డా.బి.అర్ అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన బహుజన విద్యార్థి గర్జన సభకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా వర్సిటీల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కు చిత్తశుద్ధి లేదన్నారు. వర్సిటీలో ప్రశ్నించే గొంతుకలను అణిచివేయాలనే కుట్రతోనే విశ్వవిద్యాలయాలను కేసీఆర్ భ్రష్టు పట్టిస్తున్నారని ఆరోపించారు. కాకతీయ యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రవేశాల్లో అక్రమాలు జరిగాయని శాంతియుతంగా ఆందోళన చేసిన విద్యార్థి సంఘాల నేతలపై పోలీసుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ నాయకుల ప్రోద్బలంతో వర్సిటీ



వీసీ, రిజిస్ట్రార్, డీన్స్ అందరూ కలిసి 75 శాతం పీహెచ్‌డీ అడ్మిషన్లను తమ అనుచరులకు అమ్ముకున్నారని ఆరోపించారు. జనాభాలో 99 శాతం ఉన్న పేద వర్గాలకు రాజ్యాధికారం దక్కాలన్నదే బీఎస్పీ లక్ష్యమని ప్రకటించారు. ఈ సందర్భంగా పట్టణంలో అర్ అండ్‌బీ గెస్ట్ హౌస్ నుంచి డా.బి.అర్.అంబేడ్కర్ భవన్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో స్వేరో స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మొగిలిపాక నవీన్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు రాజ్ కుమార్, ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు ప్రకాష్, మధుకర్, కుమార్ నాయకులు శ్రీధర్, జాన్సన్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చేరికలపై తకరారు..

(మొదటిపేజీ తరువాయి) కార్పొరేటర్లు అభ్యంతరం చెబుతున్నారని, ఆయనకు క్యాసినోతో సంబంధాలున్నాయనే కారణాలతో చేర్చుకోలేదు. మాజీ మంత్రి కృష్ణయాదవ్‌కు కూడా ఇలాంటి అనుభవమే ఎదురైంది. వాస్తవానికి వీరిని పార్టీలో చేర్చుకోకపోవ డానికి పార్టీలోని పెద్ద నాయకుల వర్గపోరే కారణమని తెలుస్తోంది. గతంలో అధికార బిఆర్ఎస్ పార్టీకి ప్రత్యామ్నాయం బీజేపీయేనని, వచ్చే ఎన్నికల్లో సత్తా చాటుతుందనే ఉద్దేశంతో వివిధ పార్టీలకు చెందిన చాలా మంది పార్టీలో చేరారు. పార్ల మెంట్ ఎన్నికల్లో అనూహ్యంగా నాలుగు స్థానాలు గెలుపొంది రెండో స్థానంలో నిలిచింది. ఈ ఫలితాల తరువాత పార్టీకి మరింత ఊపు వచ్చింది. కర్ణాటకలో బీజేపీ ఓడిపోవడం, ఢిల్లీ లిక్కర్ కేసును నీరుగార్చడంతో అనూ హ్యంగా బల హీనమైంది. ఢిల్లీ లిక్కర్ కేసులో ముఖ్యమంత్రి కేసీఆర్ కూతురు కల్వకుంట్ల కవితను అరెస్టు చేయకుంటే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని ఆ పార్టీ నాయకులే బహిరంగంగా వ్యాఖ్యానించారు. కవితను అరెస్టు చేయకపోవడంతో బిఆర్ ఎస్, బీజేపీ ఒకటేననే ప్రచారం ఊపందు కుంది. దీంతో నాయకులు ఒక్కొక్కరు వెళ్లిపోవడం మొదలైంది. మరికొందరు నాయకులు కూడా వెళ్లడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్నవారిని కాపాడుకుని, కొత్తవారిని చేర్చుకోవలసింది పోయి అడ్డుకోవడం పట్ల కార్యకర్తలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇలా అయితే కొత్తగా వచ్చేవారు ఎలా వస్తారని ప్రశ్నిస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ నాయకులు వివిధ పార్టీల నాయకుల వద్దకు వెళ్లి పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. గతంలో బీజేపీలో ఉన్న మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, చంద్రశేఖర్, జిట్టా బాల కృష్ణారెడ్డి, బిఆర్ఎస్‌లో ఉన్న ఆవెల్లి మోహన్ ఇతర నాయకులు భారీ సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరుతున్నారు. మరికొందరూ చేరే అవకాశాలున్నాయి. కాంగ్రెస్ నాయకులు తమకు వచ్చిన అవకాశాలను సద్వినియెగం చేసుకుంటున్నారు. బీజేపీ నాయకులు ఇలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా జి. కిషన్ రెడ్డి నియామకమైన తర్వాత జోష్ బాగా తగ్గింది. అంతర్గత విభేదాలు మరింత పెరిగాయి. ఈ నాయకుడు ఈయన మనిషి, ఆ నాయకుడు ఆయన మనిషి అంటూ విడదీస్తున్నారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సస్పెన్షన్ వ్యవహారాన్ని ఇంకా తేల్చకపోవడంతో కార్యకర్తలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.


## ఆ అంతిమయాత్ర లాహోర్ నుంచి కోల్‌కతా దాకా

చరిత్ర

అతడేమీ జాతీయనేత కాదు.. అందరికీ తెలిసిన ఉద్యమకారుడూ కాదు.. తల పండిన అనుభవజ్ఞుడూ కాదు.. 25 ఏళ్ళ కుర్రాడంతే! కానీ అతడు చనిపోయాడని తెలియగానే యావద్దేశం ఊగిపోయింది.. అంతిమయాత్రకు లక్షల మంది తరలివస్తే... బ్రిటిష్ ప్రభుత్వం కదిలిపోయింది!

బ్రిటిష్ ప్రభుత్వ హయాంలో రాజకీయ ఖైదీల పరిస్థితి దారుణం! జైళ్లలో సదుపాయాలు, అధికారుల ప్రవర్తన అత్యంత అమానవీయం! బ్రిటిష్ ప్రభుత్వం దృష్టిలో రాజకీయ ఖైదీలు మనుషులే కాదన్నట్లుండేది. ఈ పరిస్థితులు మారాలంటూ ఆమరణ నిరాహార దీక్ష చేసి 1929 సెప్టెంబరులో ఇదే రోజున (13న) అమరుడైన జతీంద్రనాథ్ దాస్ కథ వింటే ఇప్పటికీ ఒళ్లు గగుర్పాటుకు గురవుతుంది.

1904లో కోల్‌కతాలో జన్మించిన జతీంద్రనాథ్ దాస్ ఇంటర్మీడియెట్ ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యారు. మహాత్ముడి పిలుపుతో 17వ ఏటనే సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్న జతీంద్ర అనుశీలన్ సమితి అనే విప్లవవాద బృందంలో చేరారు. కోల్‌కతాలో బీఏ చదివేటప్పుడు రాజకీయ ఉద్యమాల్లో పాల్గొంటున్నాడనే నెపంతో మైమెన్‌సింగ్ సెంట్రల్ జైలు (ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఉంది)లో పెట్టారు. ఆ జైలులో పరిస్థితులకు నిరసనగా 21రోజులు జతీంద్ర నిరాహార దీక్ష చేయటంతో జైలు సూపరింటెండెంట్ దిగివచ్చి క్షమాపణ చెప్పాడు. ఆ తర్వాత దేశంలోని ఇతర విప్లవకారులతో జతీంద్రకు సంబంధాలు ఏర్పడ్డాయి. భగత్‌సింగ్ తదితరుల కోసం బాంబు తయారీకి సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో 1929 జూన్ 14న జతీంద్రను మళ్లీ అరెస్టు చేసి.. లాహోర్ కుట్రకేసులో ఇరికించి లాహోర్ సెంట్రల్ జైలుకు తరలించారు. భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురులున్నదీ అక్కడే!




ఆ జైలులో కూడా తెల్లఖైదీలు, భారతీయుల మధ్య వివక్షను, జైలులో దారుణమైన పరిస్థితులను నిరసిస్తూ, రాజకీయ ఖైదీల హక్కుల కోసం జతీంద్ర ఆమరణదీక్షకు దిగాడు. తొలుత పట్టించుకోని జైలు అధికారులు పరిస్థితి చేయి దాటకుండా బలవంతంగా తినిపించే ప్రయత్నం చేశారు. కానీ, తను లొంగలేదు. రోజురోజుకూ ఆరోగ్యం క్షీణిస్తుండటంతో భయపడ్డ జైలు అధికారులు జతీంద్రను విడుదల చేయాలని నిర్ణయించారు. బ్రిటిష్ ప్రభుత్వం పట్టుదలకుపోయి అందుకు నిరాకరించింది. కావాలంటే బెయిల్ ఇద్దాం.. అంటూ ప్రతిపాదించింది. లక్ష్యం సాధించకుండా దీక్ష విరమించేందుకు జతీంద్ర అంగీకరించలేదు. ఫలితంగా.. 63 రోజుల సుదీర్ఘ పోరాటం అనంతరం సెప్టెంబరు 13న జతీంద్రనాథ్ అమరుడయ్యాడు. ఈ వార్త తెలి యగానే లాహోర్ జైలు వద్ద పెద్దసంఖ్యలో ప్రజలు గుమిగూడారు. అంత్యక్రియలు కోల్‌కతాలో చేద్దామని నిర్ణయించారు. అమరుడి పార్థివదే హాన్ని తీసుకు రావటానికి సుభాష్‌చంద్రబోస్ 6వేల రూపాయలు పంపించారు. లాహోర్ నుంచి రైలులో బయలుదేరితే.. ప్రతి స్టేషన్‌లోనూ ఆపటమే... అంతా భోరున విలపిస్తూ నివాళులర్పించటమే! కాన్పూర్‌లో నెహ్రూ, అలహాబాద్‌లో కమలానెహ్రూ రైలు నాపి జతీంద్రకు అంజలి ఘటించారు. కోల్‌కతా హౌరా స్టేషన్‌లో సుభాష్ చంద్రబోస్ స్వయంగా వెళ్ళి పార్థివదే హాన్ని స్వీకరించారు. రైల్వేస్టేషన్ నుంచి శ్మశాన వాటిక దాకా కోల్‌కతా అంతా జనసంద్రంతో నిండిపోయింది. సుమారు 6లక్షల మంది ప్రజలు ఆ రోజు జతీం ద్ర అంతిమ యాత్రలో పాల్గొన్నారని బ్రిటిష్ ప్రభుత్వం అంచనా వేసింది! అంతమందిని చూసి అదిరిపోయిన బ్రిటిష్ పాలకులు ఆ తర్వాత మరే విప్లవవీరుడు చనిపోయినా వారి మృతదేహాలను బంధువులకు అప్పగించలేదు. **- మహ్మద్ గౌస్, సోషల్ మీడియాలో**